

ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ నుండి ఛాంబర్‌కి వచ్చాను. నర్సింహుల్ని పిలిచి ఒక కప్పు టీ ఇమ్మన్నాను.

ఫ్లాస్క్‌లో టీ కప్పులోకి వంచుతూ "సార్! అమ్మగారు ఫోన్ చేశారు.

మీరు మీటింగ్‌లో వున్నారని చెప్పాను. మీరొచ్చాక ఒకసారి ఫోన్ చెయ్యమన్నారు" అన్నాడు.

టైమ్ చూసుకున్నాను. ఐదూ ఇరవై అయ్యింది. 'ఒకవేళ సుజాత పిక్చర్ ప్లాన్ చేసిందేమో' అనుకుంటూ ఇంటికి నంబర్ డయల్ చేసాను.

"అమ్మయ్య ఉన్నారా! అరగంట నుండి ఆత్రంగా మీ ఫోన్ కోసమే ఎదురుచూస్తున్నాను" అన్నది సుజాత ఫోన్ ఎత్తుకుంటూనే.

"ఏమిటీ విశేషం ?" అన్నాను.

"విశేషముంటేనే విశేషమే! మీరట్నుంచటు మార్కెట్‌కి వెళ్ళి నాలుగు డజన్ల అరటి పండ్లూ, ఆకులూ, వక్కలూ తీసుకురండి" అన్నది హడావుడిగా.

"ఏం నోము నోస్తున్నావోయ్? ఈవేళ శ్రావణ శుక్రవారం కూడా కాదే..." అన్నాను నవ్వుతూ.

"కొన్ని పేరంటాలకు వారాలూ, వర్జ్యాలూ వుండవు. త్వరగా బయలుదేరి ఇంటికి రండి. మీ ముద్దుల కూతురు 'కుమారి జీతూ'కు అక్షింతలే ద్దురుగాని" అన్నది సుజాత, 'కుమారి' అన్న పదం ఒత్తి పలుకుతూ.

# ఋతు సంహారం

## స్వర్ణ మల్లికార్జున ప్రసాద్

ఆ మాటతో నాకు విషయం అర్థమైంది. జీతూ 'మెచ్యూరయింది'. ఆ ఆలోచన నాలో కలవరం రేపింది. పైన ఫ్యాన్ తిరుగుతున్నా వళ్ళంతా చిరుచెమటలు పట్టాయి. జీతూకి మూడురోజుల

క్రితమే 'టెన్త్' ఎగ్జామ్స్ మొదలయ్యాయి. ఈ రోజు ఉదయం మ్యాథ్స్ ఫస్ట్‌పేపర్ అయిపోయుంటుంది. ఇంకా రాయాల్సినవి వున్నాయి. ఇప్పుడు 'జీతూ' మెచ్యూరయ్యిందంటే ఇక ఎగ్జామ్స్ రాయడం పట్టి మాటే. సుజాత పట్టి చాదస్తురాలు. జీతూను 5 రోజుల. వరకు ఇంట్లోంచి కదలనివ్వదు. జీతూ.... నా ముద్దుల జీతూ... చదువే ప్రాణమైన నా జీతూ ఎంత రోదిస్తున్నదో...? కరెంట్ లేకపోయినా హరికేన్ లాంతరు వెలుగులో ముచ్చటగా చదువుకునే జీతూ అమాయకపు మొహం జ్ఞాపకాని కొచ్చింది.

డస్క్ లాక్ చేసి ఛెయిర్‌లోంచి లేచాను. అప్పటికే ఆఫీస్ స్టాఫంతా వెళ్ళిపోయారు. ఎగ్జిక్యూటివ్ బాడి మీటింగ్ వుండటం వల్ల నేను అపటివరకూ వుండవలసి వచ్చింది. నేను వెళ్ళడం కోసమే నర్సింహులు ఎదురుచూస్తున్నట్లున్నాడు.

స్టాండ్‌లోంచి స్కూటర్ తీసి స్టార్ట్ చేసాను. స్కూటర్ ఇంటిదారి పట్టింది.

"మార్కెట్‌కి వెళ్ళ లేదా? నర్సింహుల్ని పంపించారా!"అన్నది సుజాత వాకిట్లోనే ఎదురవుతూ, నేనేమీ మాట్లాడలేదు. ముందు నా చిట్టితల్లి ఎలా వున్నదో చూడాలి. వేగంగా ఇంట్లోకి వెళ్ళాను.

డ్రాయింగ్ రూమ్‌లో చెప్పల స్టాండ్ వుండాల్సిన మూల 'జీతూ నివాసమయింది. కొబ్బరాకులు పరిచి, వాటి మీద తెల్లటిధోవతి వేసారు. అక్కడే మౌనంగా తల వంచుకొని కూర్చొని వుంది జీతూ... అశోకవనంలో సీతలా!

జీతూ వదనంలో సంతోషఛాయలు కన్నీటి చారికల కింద కరిగిపోయాయి. అడుగల చప్పుడుకు తలెత్తి చూసింది. నన్ను చూస్తునే ఒక ఉదుటున లేచి "డాడీ" అంటూ నన్ను పెనవేసుకొని పెద్దగా ఏడవడం మొదలు పెట్టింది.

నా చిట్టితల్లి జీతూ... 'డాక్టర్' కావాల్సిన జీతూ అలా నిస్సహాయంగా రోదించటం నేను భరించలేకపోయాను. "ఊరుకోమ్మా, డాక్టర్ దగ్గరకు వెళ్దమా? కడుపులో నొప్పిగా వుందా" అన్నాను జీతూను అనునయిస్తూ.

"అయ్యో! ఇదెక్కడి చోద్యమండీ? డాక్టరు దగ్గరకెళ్ళేందుకిదేమైనా రోగమా? రొష్టా? మైలా, శుచీ లేకుండా మరీ ఇంత అఘాయిత్యపు మనుషులయ్యారు. దాన్నొదిలి ఇవతలకి రండి. జీతూ! నీకెన్నిసార్లు చెప్పాను అక్కడ్నుంచి కదలకూడదని" అరచినట్లుగా అన్నది సుజాత.

జీతూ నన్ను వదల్లేదు. ఏడుస్తూ "డాడీ! నేను ఎగ్జామ్స్ రాస్తాను. నన్ను ఆపొద్దని మమ్మీకి చెప్పండి డాడీ. మమ్మీ నన్ను ఎగ్జామ్స్‌కి పంపించనంటోంది. అయిదురోజులు ఎక్కడికీ కదలకూడదట! మీరైనా చెప్పండి దాడీ! మొన్న 'ప్రీ పబ్లిక్'లో 'కిషోర్'కి ఫస్ట్‌ర్యాంక్ వచ్చిందని నన్నెంత గేలి చేసాడూ...తన కంటే ఐదు మార్కులే కదా నాకు తక్కువ. ఇప్పుడెలాగయినా కిషోర్ కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలి. నేను ఎగ్జామ్స్ రాస్తాను డాడీ!" అన్నది.

స్త్రీ జీవితంలోకి కౌమారం చెప్పకుండానే వస్తుంది. అది నా చిట్టితల్లి జీవితంలోకి వస్తూనే వెన్నుపోటు పొడిచింది. 'బాల్యాన్ని జయించిన కౌమారమా! నా చదువుల తల్లి కిషోర్‌ను జయించాలనుకున్నప్పుడు రావాలా నువ్వు...'

"జీతూ !ఏడవకమ్మా, నువ్వు ఎగ్జామ్స్ రాయడం మానక్కర్లేదు. ఆఫీసుకి శెలవుపెట్టయినా నిన్ను తీసుకెళ్ళి ఎగ్జామ్స్ రాయిస్తాను. మమ్మీకి నేను చెబుతానుగా వెళ్ళి కాసేపు రెస్ట్ తీసుకో. మళ్ళీ రేపు ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవద్దూ.." అన్నాను.

అప్పటివరకూ తొలి యవ్వనం పెట్టిన క్షోభను ఒక క్షణంలోనే మర్చిపోయి 'నిజమా డాడీ' అన్నట్లు నా కళ్ళలోకి చూసింది.

"ష్యూర్ బేబీ! ఈ సారి స్కూల్ ఫస్ట్ మా 'డాక్టర్' గారిదే" అన్నాను తన రెండు చెంపలు నిమురుతూ.

ఆ మాటతో జీతూ తృప్తిపడింది. ప్రపంచాన్ని జయించిన ఉత్సాహంతో 'రేక్' లో నుంచి బుక్స్ తీసుకొని మళ్ళీ కొబ్బరాకుల సింహాసనం అధిష్టించబోయింది.

"జీతూ! నీ గదికి వెళ్ళమ్మా అక్కడ కూర్చోవాల్సిన అవసరం లేదు" అన్నాను షూస్ విప్పకుంటూ.

స్త్రీ ప్రథమ శత్రువు ప్రకృతే. పురుషుల కంటే భిన్నమైన శరీరధర్మాల్ని ఆపాదించి, పురుషుడి కంటే ఒక మెట్టు దిగువన వుంచింది. ప్రతిక్షణం ఆమె అబలత్వాన్ని గుర్తు చేస్తుంటుంది. వీటిని ఆసరాగా తీసుకున్న ఆచారాల సంకెళ్ళు స్త్రీని మరింత దిగజారుస్తున్నాయి. సాధించాలనుకున్న 'ఎచీవ్‌మెంట్'కు అనుక్షణం అడ్డుతగులుతూ వారిని మరింత క్రుంగదీస్తున్నాయి. తన చెల్లెలు రేవతి లాయర్ కావాలని ఎన్నికలలు కన్నది. ఇంటర్మీడియట్ చివరి ఎగ్జామ్స్ రోజున 'మెన్సెస్' అవ్వడంతో దాని జీవిత గమనమే మారిపోయింది. మెన్సెస్‌తో కడుపునొప్పి మెలికలు తిరిగిపోయింది. పరీక్షకు మాత్రం వెళ్ళలేక పోయింది. నల్లకోటు తొడుక్కోవాలన్న ఆశల చుక్కాని నాన్నకిచ్చేసి అశ్రునయనాలతో అత్తవారింటికి వెళ్ళిపోయింది.

"త్వరగా ఆ బట్టలు విప్పేసి స్నానం చేసి రండి. చంద్రమన్నయ్య ఇంటికి వెళ్ళద్దూ...? వదిన్నిసాయం తెచ్చుకుంటే గాని రేపు పేరంటం ఏర్పాట్లు చెయ్యలేను" అన్నది సుజాత కాఫీ అందిస్తూ. స్నానం చేసి, పట్టుచీర కట్టుకొని ముస్తాబయి వుంది సుజాత. గదిలో మూల జీతూ లేకపోవడం చూసి "జీతూ ఎక్కడికి వెళ్ళిందీ? జీతూ..." అని కేకేసింది ఒక్కసారిగా.

"దాన్ని డిస్టర్బ్ చేయకు. చదువుకోనీ" అన్నాను తన వైపు తిరిగి. "మీ గారాబంతో దాన్ని మరీ చెడగొడుతున్నారు. అలా 'ముట్లు' ఇంట్లో కలువుకుంటారా..?" అన్నది కాస్త ఆవేశంగా.

"నువ్వు శుచిగా వుంటున్నావు కదా. చాల్లే ఇంకా దాన్ని కూడా ఎందుకు బాధపెడతావు?" అన్నాను. అసహనం గానే మౌనం వహించింది సుజాత.

పెళ్ళయిన కొత్తల్లో సుజాతను కూడా ఎడంగా వుండొద్దనే అన్నాను. అందుకు తను ఒప్పకోలేదు. "అట్లా కలువుకోవడం పాపం" అంది.

"అందరికీ తెలిసేటట్లు అలా ఎడం ఎడంగా వుంటూ, "నేను మెన్సస్ అయ్యానహో' అంటూ

## స్వయిగలిజమ్

ఒక ఇంగ్లీషు నాటకంలో మిసెస్ మాల్ ఎప్రాప్ అనే పండితురాలు అనేక తప్పలతో ఇంగ్లీషు గడగడా మాట్లాడేస్తూ వుంటుంది. అలా ఒకమాటకు మరో మాట మాట్లాడుతూ తప్పల తడకలతో ఇంగ్లీషు మాట్లాడటానికి "మాల్ ఎప్రోపిజమ్" అనే పేరు స్థిరపడిపోయింది. అలాగే హాలీవుడ్‌లో అవసరానికి అబద్ధాలను నిజాలను కలగలిపి తికమక పెట్టడాన్ని "స్వయిగలిజమ్" అన్న పేరుతో పిలుస్తుంటారు.

హాలివుడ్‌లో పేరెన్నిక గన్న సుప్రసిద్ధ చిత్రనిర్మాత, దర్శకుడూ శ్యామ్ స్వయిగల్ వాటికీ, నేటికీ అద్భుతమైన్న కళాఖండాలుగా విమర్శకులు చెప్పకునే కొద్దిపాటి హాలీవుడ్ చిత్రాలలో నాలుగు ఆయన దర్శకత్వం వహించినవే.

అలాంటి మేధావి కూడా ఆత్మరక్షణకు, వ్యాపారాభివృద్ధికీ అవసరం అనుకున్నప్పడల్లా తీబద్ధాలు అందంగా ఆడేవాడు. తను పుట్టింది పోలెండులోనైనా ఆస్ట్రేలియాలో జన్మించానని చెప్పి ఆ దేశస్థుల అభిమానాన్ని దోచుకున్నాడు. తను తీయబోయే చిత్రంలో 'ఛార్లెస్ బోయర్' నటించడానికి ఉత్సాహపడుతున్నాడని ఛార్లెస్ లాటిన్‌కి చెప్పి అతన్ని ఊరించి తెలివిగా తన సినిమా నటీమణుల్ని బుక్ చేసుకునేవాడు.

చివరకు ఈ విషయం బైటపడిపోయింది. అవసరానికి అబద్ధాలు చెప్పడాన్ని "స్వయిగలిజమ్" ఆయన పేరునే స్థిరపడిపోయింది.

సేకరణ: పి.వి. రమణకుమార్.

చాటు కోవడం సిగ్గుగా వుండదా?"అన్నాను. "అందులో సిగ్గు పడాల్సిన విషయం ఏముంది?"అన్నది. నేను ఆశ్చర్యపోయాను. సంప్రదాయ కుటుంబంలోంచి వచ్చిన ఆవిడ నైజం అంతేలెమ్మని సరిపెట్టుకున్నాను. కానీ జీతూ విషయంలో అందుకు అంగీకరించలేక పోయాను.

"త్వరగా బయలుదేరండి. భారతిగారు కారు తెస్తానన్నారు." అన్నది సుజాత ఆ విషయాన్ని అంతటితోవదిలేస్తూ...

నా కొలీగ్ ప్రభాకర్ భార్య భారతి. కంపెనీ ఇచ్చే లోన్ సదుపాయంతో కారు కొనుక్కున్నారు. ప్రభాకర్ కంటే ఆవిడే డ్రైవింగ్‌లో దిట్ట అని ప్రతీతి.

"మరింకేం! మీరిద్దరూ వెళ్ళిరండి. చందూ ఇంటికి" అన్నాను షర్ట్ విప్పుకుంటూ.

*　　　　　　*

కంపెనీ డాక్టర్‌కి ఫోన్ చేశాను. ఫోన్‌లోనే చిన్నగా నవ్వుతూ'యూ డోన్ట్ వర్రీ మిస్టర్ శర్మా! పాప తప్పకుండా అటెండ్ అవ్వొచ్చు. నీరసంగా లేకుంటే సరి. డ్యూటీ నుండి వెళ్ళేప్పుడు తప్పకుండా వచ్చి వెళతాను" అని సమాధానమిచ్చింది.

స్నానం చేసి లుంగీ, షర్ట్ వేసుకున్నాను. ఒకసారి కిచెన్‌లోకి తొంగిచూసాను. షెల్ఫ్‌లో 'బోర్నవిటా' కన్పించింది. దానిని చేతిలోకి తీసుకొని పాల కోసం ఫ్రిజ్ ఓపెన్ చేసాను. ఎదురుగా బత్తాయిలు దర్శనమిచ్చాయి. బోర్నవిటాను షెల్ఫ్‌లో వుంచేసి బత్తాయిలు తీసుకున్నాను. పది నిమిషాల తర్వాత చేతిలో జ్యూస్ గ్లాస్‌తో జీతూ గదిలోకి ప్రవేశించాను.

మంచానికి అడ్డంగా పడుకొని సీరియస్‌గా ప్రాబ్లమ్స్ చేస్తోంది జీతూ. మరునటి రోజు మ్యాథ్స్ సెకండ్ పేపర్.

"జీతూ బేబి! హేవ్ యూ ఎనీ ప్రాబ్లమ్?" ప్రక్కనే కూర్చుంటూ అడిగాను.

"నో డాడీ!ఐ యామ్ ఆల్‌రైట్" అన్నది జీతూ జ్యూస్ గ్లాసు అందుకుంటూ.

ఎక్కువ డిస్టర్బ్ చేయడం ఇష్టం లేక అక్కడ్నుండి లేవబోయాను. నన్ను లేవనీయకుండా నా చేతిని పట్టుకొని "మమ్మీ చందూ మావయ్య ఇంటికి వెళ్ళింది గదూ డాడీ" అన్నది నా కళ్ళల్లోకి చూస్తూ. .. ప్రశ్నార్థకంగా చూసాను తనవైపు.

"రేపు అత్తయ్య, శేషు పిన్ని, అమ్మమ్మ అందరూ వస్తారట. కాలనీలో అందరినీ పిలిచి పేరంటం చేస్తారట. ఈ పేరంటం నాకు ఇష్టం లేదు. మమ్మీకి ఎంత చెప్పినా వినిపించుకోవడం లేదు. మీరైనా ఈ పేరంటం వద్దని చెప్పండి డాడీ. ప్లీజ్...." అన్నది జీతు.

నాకున్న ఆలోచనా విధానమే నా కూతురికీ వున్నందుకు కించిత్ గర్వపడ్డాను. అయినా అడిగేశాను. "ఎందుకిష్టం లేదమ్మా"అని, "అందరినీ పిలిచి మా అమ్మాయి పెద్దమనిషి అయ్యిందని చాటింపు వేస్తే రేపు మన కాలనీ మగపిల్లలంతా ఎంత వింతగా చూస్తారో... ఆ చూపుల్ని తట్టుకొని నేను మునుపట్లా తిరగలేను. నాకీ పేరంటం వద్దు"...

జీతూ అంతర్మథనం అంతకు మించి చెప్పలేక పోయింది. కానీ అందులో ఎంత అంతరార్థముంది! నాకిప్పుడు జీతూలో ఎదుగుతున్న వ్యక్తిత్వం కనబడుతున్నది. బాల్యాన్ని దాటుకుంటూ పెద్దమనిషవుతున్న జీతూను వ్యక్తిగా ఎదగనివ్వాలి. వికసించాల్సింది పాప వ్యక్తిత్వం.

నాకిప్పుడు ఒక విషయం అర్థం కాకుండా వుంది. పెద్దమనిషి అయినప్పటి వేడుకలు ఏ ఆడపిల్లా ఇష్టపడదా? ఏమో... ఇప్పటి వాళ్ళు మాత్రం ఇష్టపడరు. జీతూ ఈ తరం పిల్ల...

---

*** పెళ్ళి విటమిన్లు అందించే ఒక సాధనం. భార్యాభర్తలు ప్రతిదినం, తమ తమ భాగస్వామికి లోటుగా వున్న విటమినులను పూరిస్తారు.**

**సేకరణ: కృష్ణస్వామి**


**నాణ్యత, మన్నిక కోరేవారికి ఎక్కువ అందం ఆనందాన్నిచ్చే నగలు "శ్రీ నగలు"**

**"30 సం॥లకు పైగా మీ ఆదరణ పొందిన సంస్థ**

**ఫోన్స్ : 22785 (O)**

**: 22235 (R)**




**విజయ**

**శ్రీ గోల్డ్ కవరింగ్ వర్క్స్**

**P.B.No : 35, శ్రీ మహల్, మచిలీపట్నం - 1**

**ఆంధ్ర ప్రదేశ్**

1. డీలరుషిప్పు ఇవ్వబడును.
2. అన్ని ముఖ్య పట్టణములలో మా డీలర్లు కలరు.

DURABLE FOR SEVERAL YEARS

SREE GOLD COVERING WORKS

SREE

MACHILIPATNAM

**30 YEARS SERVICE**

**మా సేల్స్ బ్రాంచీలు**

(1) స్టాల్ నెం. 2, కోనేరు సెంటర్, మచిలీపట్నం (2) శేషయ్య స్ట్రీట్, విజయవాడ - 1, (3) 17/317, ట్రంక్ రోడ్, నెల్లూరు (4) 141, జి.కార్ స్ట్రీట్, తిరుపతి, ఫోన్ : 22085 (5)**50**గాంధీ రోడ్‌తిరుపతి(6) రామర్ కోయిల్ స్ట్రీట్, చిత్తూరు (7) 14/43 సుభాష్ రోడ్, అనంతపురం (8) మద్రాసు రోడ్, కడప (9) నెం. 14, పాతబస్‌స్టాండ్ ఎదురుగా, కర్నూలు (10) నెం. 212, బి 1, నాగులకుంట రోడ్, నంద్యాల (11) 181, బసవన్న గుడి వీధి, అవెన్యూ రోడ్ క్రాస్, బెంగుళూరు - 53, ఫోన్ : 266410 (12) గాంధీ బజార్, బెంగుళూరు - 4, (13) 86, జయంతి బిల్డింగ్స్, అవెన్యూ రోడ్, బెంగుళూరు-2, ఫోన్ : 210080. (14) 77-1, కళ్యాణ్ బిల్డింగ్స్, బలేపేట, బెంగుళూరు-53, (15) గాంధీ బజార్, షిమోగా (16) 129, రాఘవేంద్ర బిల్డింగ్స్, అవెన్యూ రోడ్, బెంగుళూరు.

"మీరేమంటున్నారో నాకర్థం కావడం లేదు. పిల్లకి పేరంటం కూడా చెయ్యలేదని నలుగురూ నవ్విపోతారు. మా వాళ్ళల్లో తలవొంపులు పడలేను. ఇప్పటికే నేనంటే చులకనగా వుంది. వున్న ఒక్క కూతురికీ వేడుక చేసుకోకపోతే ఎంత వుండీ ఏం సుఖం...? మేరీ విషయంలోనే ఎందుకు లోభిస్తున్నారో అర్థం కాకుండా వుంది." అన్నది సుజాత.

"నలుగురూ నవ్విపోతారని మనీకి ఇష్టం లేని పనులు చేసుకోనక్కరలేదు. నీకంత వేడుక చెయ్యాలనిపిస్తే దానికి ఇంటర్ లోనో.. ఎంసెట్‌లోనో ర్యాంకు వచ్చాక చేసుకో. ఏదన్నా ఘనకార్యం సాధిస్తే వేడుక గానీ, ఉత్తి పుణ్యానికి వేడుక చేసుకుంటాననటా వేమిటి?

పెద్దమనిషవ్వడం అదేమంత ఘనకార్యమని? ఆడదై పుట్టిన ప్రతిఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు అవుతూనే వుంటారు. దానికింత ఆర్భాటాలూ... హంగులూ అనవసరం. నా జీతూ జీవిత పరమార్థం వేరే వుంది. ఆ బాటలో అది ఎక్కే ప్రతిమెట్టుకీ వేడుక చేద్దువుగాని. ఇప్పుడు నువ్వేదో వేడుక చేస్తున్నానని అనుకుంటూన్నావేమో. అది వేడుక కాదు దాని పాలిట సంకెళ్ళవుతాయి. పేరంటం తాంబూలం తీసుకున్న నలుగురూ నాలుగు సంకెళ్ళు దానికి తగిలించి వెళతారు. రేపట్నుంచి అది మనస్ఫూర్తిగా నవ్వేందుకు లేదు. ఆడేందుకు లేదు. పాడేందుకు లేదు.

ఆడదానికిఆడదే శత్రువంటారు. అది నిజమో కాదో గానీ నువ్వు మాత్రం దానికి శత్రువులానే పరిణమించావు. మనస్సు విప్పి నీతో చెప్పకోవలసిన విషయాలు నాతో చెప్పకుంది. అదీవేళ తన లెక్కల పుస్తకంలో ఏం రాసిందో తెలుసా? 'అమ్మఒడిలో తల దాచుకోలేని అశక్తత అశ్రుధారలై కురుస్తోంది' అని.


సుజాతా.. జీతూ ఆవేదనని గ్రహించు. స్త్రీని స్త్రీయే అర్థం చేసుకోక పోతే ఎలా? ఒక్కసారి నీ బాల్యయవ్వన సంధి కాలాన్ని గుర్తుతెచ్చుకో. నువ్వింత క్షోభ అనుభవించలేదూ...? మనసుకు రాని యవ్వనం శరీరానికి మాత్రమే వచ్చి, మనసు కూడా యవ్వనాన్ని సంతరించుకొనే వరకు సాగే అస్తవ్యస్త ఒడిదుడుకుల జీవితాన్ని, అమ్మ ఒడిలో తలదాచుకోలేని ఆ అశక్తతనూ ఒక్కసారి గుర్తుతెచ్చుకో ఆ పరిస్థితి జీతూకి రానివ్వకు."

సుజాత మౌనంగా వింటూనే వుంది. మౌనం అర్థాంగీకారం అన్న విషయం ఏమో గానీ, సుజాత విషయంలో మాత్రం మౌనం పూర్తి అంగీకారమే. ఆ రహస్యం నాకొక్కడికే తెలుసు.

కాలింగ్ బెల్ మ్రోగడంతో లేచి వెళ్ళి తలుపు తీసాను. ఎదురుగా రావలసిన అతిథి డాక్టర్ 'సుమతీ సుప్రభాత'!

◆

## మళ్ళీ కొత్త శత్రుత్వంతో...



ఆ సందర్భానికి
మనిద్దరం
రెండు విరుద్ధాంశలతో పరిచయమౌతాం
నేనలా ప్రవర్తించాలి కాబట్టి ప్రవర్తిస్తున్నట్టు
నువ్వలా ప్రయత్నించాలి కాబట్టి ప్రయత్నిస్తున్నట్టు
ఎవరి తొడుగుల్లో వాళ్ళం ఎదురుపడుతుంటాం
అసంబద్ధంగానే అల్లుకుపోతుంటాం
నేను చూపే ప్రపంచాన్ని మాత్రమే
చూడటానికి నియంత్రించబడ్డ
చూపులతికించుకొని
ఓ కలబోత క్షణంలో
ఏదో వినాలన్న తహతహతో
తనువంతా చెవులు చేసుకుని
చూస్తుంటావు నువ్వు
నీ ఊహని తలక్రిందులు చేస్తూ
నా పని గురించే కబురెత్తుకుంటా
ఒంటరి క్షణాల మధ్య సమూహం మధ్య
ఎప్పుడూ పని ఆలోచనలోనే తలబడుతుంటా
పని నించి పనికేసి కదులుతున్నప్పుడు
ప్రాణవాయువులా నువ్వు కలుస్తావు
నా ఊపిరిని పిల్లన గ్రోవిలోకి పంపి
రాగాలు రాగాలుగా నన్ను మలుస్తావు
వాటి కోసం మళ్ళీ
పనికేసి కదలడం తప్పనిసరౌతుంది
ఇద్దరి మధ్యా ఇద్దరి కలయికల మధ్యా
పనిపాము పిల్లై మెలికలు తిరుగుతుంది
ఇద్దర్నీ రెండు మౌన తీరాల మీద నిలబెట్టి
తీగెల మీద మాటలు మొలవకుండా చేస్తుంది
నన్ను తీర్చి దిద్ది వంట గది పనిలో ఆవిర్లు కక్కి
టిఫిన్ బాక్సులోకి దూరి నా కూడా వస్తావు
తరిగి కూరిన కూర పోవులానో
కుక్కర్లో ఉక్కిరి బిక్కిరైన మెతుకులానో
నా ఆకల్లోకి దూరి
ఆవిరి యంత్రంలా నన్నుకదిలిస్తావు
యంత్రాల మధ్యనో కాగితాల మీదో గనుల్లోనో
గందరగోళాలు దాటి గండాలు దాటి
పరిగెత్తుతుంటా
ఆకారం లేని అబద్ధపు మనసు నీ కిచ్చి
మరో చేతిలో పనిముట్టునై కదులుతున్నవాణ్ణి
ఊహ నుంచి ఒలికిపోతున్న బతుకుని
భుజానేసుకుని నువ్వూ,
ఉట్టి మరబొమ్మనై నేనూ
తరుముతున్న దాహం ముందు
ఇరవై నాలుగ్గంటలూ పరిగెత్తూనే వుంటాం
పరిగెత్తి పరిగెత్తి
ఇద్దరం రెండు క్షతగాత్ర శకలాలమై
ఎవరి మూసలోకి వాళ్ళం చేరిపోతాం
మళ్ళీ మళ్ళీ కొత్త శత్రుత్వంతో తలపడుతూ
మనది కాని గమ్యం కేసి
తోసుకుంటూ తొక్కేసుకుంటూ
పరుగు కొనసాగిస్తుంటాం

– పరుఖల శివకుమార్